క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన జాన్‌వెస్లీ

దాబాగార్డెన్స్: ఏపీ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ మంగళవారం వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు ఎన్నికల డ్యూటీ పారితోషికం చెల్లించాలి

దాబాగార్డెన్స్: ఆశ వర్కర్ల ఎన్నికల డ్యూటీ పారితోషికం అందజేయాలని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి. మణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్, డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు జిల్లాలో గల ఆశ వర్కర్లు మే 13న పూర్తి రోజు ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు నిర్వహించారన్నారు. ఈ క్యాంపులు నిర్వహించినందుకు ఆశ వర్కర్లకు రెమ్యూనరేషన్ చెల్లించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసిన ఫలితంగా ఆశ వర్కర్లకు రూ.200 రెమ్యూనరేషన్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. గాజువాక, విశాఖ పశ్చిమ నియోజకవర్గాల్లో చెల్లించారని, మిగిలిన 5 నియోజకవర్గాల్లో ఇంత వరకు చెల్లించలేదన్నారు. ఎన్నిక పూర్తయి నెల దాటినప్పటికీ ఇంకా చెల్లింపులు జరపకపోవడం బాధాకరమని, కలెక్టర్ స్పందించి తక్షణం చెల్లింపులు జరిగేటట్టు చూడాలని విజ్ఞప్తి చేశారు.

యోగసిద్ధాంజనేయుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో యోగసిద్ధాంజనేయుడు

మురళీనగర్: జాతీయ రహదారి సూర్యానగర్-2లో వెలసిన యోగ సిద్ధాంజనేయుడికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అరవిల్లి శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో సంప్రదాయ పద్ధతిలో పూజలు చేశారు. ఉదయం 7 గంటలకు నిత్యార్చన, 9 గంటలకు సుందరకాండ పారాయణం, అనంతరం స్వామిని పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం 5గంటలకు భక్తులతో సామూహిక హనుమాన్ చాలీసా పఠనం, 6.30గంటలకు తమలపాకులతో పూజ నిర్వహించి భజనానంద హారతి సమర్పించారు. జూలై 1వ తేదీన నిర్వహించే పంచామృతాభిషేకంలో పాల్గొనాల్సిన వారు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని అర్చకుడు శ్రీకాంతాచార్యులు తెలిపారు. ఆరోజు ఉదయం 7.30 గంటలకు పంచామృతాభిషేకం, 6.30గంటలకు సింధూరార్చన నిర్వహిస్తామన్నారు.

కల్యాణం.. కమనీయం

జ్యేష్ఠ్య శుద్ధ దశమిని పురస్కరించుకుని ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి కల్యాణం, పోర్టు వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై దివ్య కల్యాణ మహోత్సవాలను కనులారా వీక్షించారు.

- బాబాజీ కొండపై ఆధ్యాత్మిక వైభవం
- దేదీప్యమానమైన పోర్టు వేంకటేశ్వరుని ఆలయ ప్రాంగణం
- తిలకించి పులకించిన భక్తజనం



సత్యదేవుని పరిణయ వేడుకలను నిర్వహిస్తున్న అర్చకులు

దాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గం మంగళవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ప్రతి ఏటా జ్యేష్ఠ్య శుద్ధ దశమి రోజున పలు దేవాలయాల వార్షికోత్సవాలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి కల్యాణం, పోర్టు ఏరియా శృంగమణి పర్వతంపై వెలసిన వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.

కనుల పండువగా సత్యదేవుని పరిణయం..

ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవం మంగళవారం కనుల పండువగా సాగింది. ఉదయం 8 గంటలకు నిత్య హోమాలు, వైనతేయ ప్రతిష్ట జరిపారు. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 9 గంటలకు స్వామి సామూహిక వ్రతాలు, 11 గంటలకు ధ్వజారోహణం నిర్వహించారు. 7 గంటలకు ప్రారంభమైన స్వామి దివ్య తిరు కల్యాణోత్సవానికి నగరం నుంచే కాక సుదూర ప్రాంతల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు. వేద మంత్రాలు, సన్నాయి వాయిద్యాల మధ్య స్వామి కల్యాణం జరిపారు. ఆలయ ఈవో బుద్ధ నాగ జగదీష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఫణిహారం నరసింహమూర్తి, పలువురు దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు..

కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 8 గంటలకు నిత్య కార్యక్రమాలు, విశేష పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు నిత్య పూజలు, హోమాలు జరపనున్నారు. సాయంత్రం 4 గంటలకు స్వామి తిరువీధి రథోత్సవం వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ సాగనుంది. ఆలయ నూతన ఘాట్ రోడ్డు నుంచి బయలుదేరి పూర్ణామార్కెట్ జంక్షన్, దుర్గాలమ్మ గుడి, జగదాంబ జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, ఆంజనేయస్వామి ఆలయం మీదుగా ఆలయానికి చేరుకోనుంది.

అత్యంత వైభవంగా పోర్టు వేంకటేశ్వరస్వామి కల్యాణం..

పోర్టు ఏరియా శృంగమణి పర్వతంపై వెలసిన వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు స్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె. శిరీష, ఆలయ ఈవో శ్రీనివాస్, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని కల్యాణంలో పాల్గొన్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామిని గరుడ వాహనంపై ఊరేగించనున్నారు.



పోర్టు వేంకటేశ్వరస్వామి కల్యాణలో భక్తులు

నేటి నుంచి ఉమా చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణోత్సవాలు

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వేంచేసిన ఉమా చంద్రమౌళీశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం 9 గంటలకు విఘ్నేశ్వరపూజ, కల్యాణరాట, కంకణ ధారణ జరుగుతుందని ఆమె వివరించారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, దీక్షా వస్త్రధారణ, కంకణధారణ, మండపారాధన, ధ్వజారోహణ ఉంటాయన్నారు. 21వ తేదీ శుక్రవారం స్వామి వారికి విశేష అభిషేకాలు, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు సాయంత్రం ఉత్సవ విగ్రహాల తిరువీధి ఉత్సవం అనంతరం దివ్య కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానం

నూతన కార్యాలయం ప్రారంభం



యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆర్చి బిషప్ జయరావు

దాబాగార్డెన్స్: విశాఖలో ఆలిండియా క్యాథలిక్ యూనియన్ నూతన కార్యాలయం ఏర్పడింది. నగరంలోని సెయింట్ ఆంథోనీ చర్చి సమీపాన ఏర్పాటు చేసిన యూనియన్ కార్యాలయాన్ని విశాఖ అగ్రపీఠాధిపతి ఆర్చి బిషప్ పి. జయరావు, వికార్ జనరల్ ఫాదర్ దుగ్గంపూడి బాలశౌరి ప్రారంభించారు. ఏఐసీయూ చరిత్ర, సంఘ కార్యకలాపాల ఉన్నతి, ప్రగతి గురించి ఏఐసీయూ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ వివరించారు. ఏఐసీయూ విశాఖ శాఖ అధ్యక్షుడు బూర రవీంద్ర శేషుబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ జాతీయ కార్యదర్శి స్వామినాథంతో పాటు పెద్ద సంఖ్యలో క్యాథలిక్ క్రైస్తవులు పాల్గొన్నారు.

అసభ్య ప్రసంగాలను ప్రతిఘటించండి

సీతంపేట: అసభ్య ప్రసంగాలను ప్రతిఘటించండి అంటూ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ సంస్థ పిలుపునిచ్చింది. ఈ మేరకు బుల్లయ్య కళాశాల గాంధీ సెంటర్‌లో సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాల మోహన్‌దాస్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిని జాగృతం చేసే బదులు జాతి ఐక్యతకు భంగం కలిగేలా ప్రసంగాలు ఉంటున్నాయని అది ఎంతమాత్రం క్షేమకరం కాదన్నారు. ఐక్యరాజ్యసమితి ఏటా జూన్18న అంతర్జాతీయ అసభ్య ప్రసంగాల ప్రతి ఘటనా దినంగా ప్రకటించిందని గుర్తుచేశారు. పీస్ అండ్ హార్మోనీ సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ప్రజలను జాగృతం చెయ్యాలనే సంకల్పంతో ఈ నెల 23న ఉదయం 10 గంటలకు బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యావేత్తలు, మతపెద్దలు పాల్గొని తమ అభిప్రాయాలు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞాన్‌కుమార్, అబ్దుల్ మునీర్, సత్యమూర్తి పాల్గొన్నారు.



గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

హుద్‌హుద్ బాధితులకు ఇళ్లు కేటాయించాలి



ధర్నా చేస్తున్న హుద్‌హుద్ బాధితులు

మహారాణిపేట: హుద్‌హుద్ తుపానులో ఇళ్లు కోల్పోయిన తమకు ఇళ్లు కేటాయిస్తూ పట్టాలు ఇచ్చారని.. అయితే తమకు కేటాయించిన ఇళ్లలోకి వెళ్తే కొందరు అడ్డుకుని ఇవి తమ ఇళ్లు అని.. మీకెవరు ఇచ్చారని ప్రశ్నిస్తున్నారని లబ్ధిదారులు వాపోయారు. డ్రా ద్వారా నూట యాభై ఒక్క మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారని తెలిపారు. బక్కన్నపాలెంలో హుద్‌హుద్ బాధితుల కోసం నిర్మించిన 320 ఇళ్లల్లో తమకు ఇళ్లు కేటాయించాలని వారు కోరుతూ కలెక్టరేట్ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

ఆర్‌ఎంపీలకు అవగాహన

తాటిచెట్లపాలెం: గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలందిస్తున్న ఆర్‌ఎంపీలకు మంగళవారం రైల్వేన్యూకాలనీలోని అక్షయ హాస్పటల్‌లో అవగాహన నిర్వహించారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో అక్షయ హాస్పటల్ ఎండీ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ హాస్పటల్‌లో అన్ని సదుపాయాలు ఉన్నాయని, నాణ్యమైన వైద్య పేదలకు అందించడమే తమ ధ్యేయమని, వారి పరిధిలో ఉన్న పేదలకు వైద్య సేవల కోసం తమ ఆస్పత్రిని వినియోగించుకోవాలని కోరారు. సదస్సులో పాల్గొన్న గైనకాలజిస్ట్ డాక్టర్ కేకే శిరీష, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ భావన, ఆర్థోపెడీషియన్ డాక్టర్ వర్మలు వివిధ అంశాల్లో అవగాహన కల్పించారు. సంఘం అధ్యక్షుడు జంగం జోషి, జోనల్ గౌరవాధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, సలహాదారు కోన ప్రకాష్, ప్రధాన కార్యదర్శి సుగుణేశ్వరి, విజయనగరం జిల్లా అధ్యక్షుడు చిరంజీవి కనకారావు, పడాల కోటి, లోగిశ గణేష్‌లతో పాటు గాజువాక, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్‌ఎంపీ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కేకే శిరీష్

గంజాయి అక్రమ తరలింపుపై పోలీసుల నిఘా

సీతమ్మధార: నగరంలోని గంజాయి అక్రమంగా తరలిస్తున్న వారిపై ద్వారకా పోలీసులు నిఘా పెట్టారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాలు గుర్తించారు. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ నేతృత్వంలో నగర పోలీస్ కమిషనరేట్ పరిధి ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో కొన్ని ప్రాంతాలు గుర్తించి ఈప్రాంతాల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. గురుద్వార్, ఆశీలమెట్ట, రామాటాకీస్, సీతమ్మధార, అల్లూరి సీతారామరాజు జంక్షన్, సత్యం జంక్షన్‌తో పాటు పలు ప్రాంతాల్లో పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేసి గంజాయి అక్రమ రవాణాపై చర్యలు తీసుకోనున్నారు.

శిథిలావస్థలో రెవెన్యూ క్వార్టర్లు



రంగులు వెలిసిపోయిన క్వార్టర్లు



పెచ్చులు ఊడిపోతున్న భవనం

సీతమ్మధార : స్థానిక సీతమ్మధారలోని రెవెన్యూ క్వార్టర్లు శిథిలావస్థకు చేరకున్నాయి. క్వార్టర్ల ఆవరణలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తున్నాయి. కొన్నేళ్ల క్రితం రెవెన్యూ శాఖ సిబ్బంది నివాసం నిమిత్తం దాదాపు 150 క్వార్టర్లు నిర్మించారు. అప్పట్లో గ్రౌండ్+2 తరహాలో భవనాలు నిర్మించారు. ఇక్కడ 50 వరకు క్వార్టర్లు మూతపడగా, ప్రస్తుతం 60 వరకు క్వార్టర్లు మాత్రమే వినియోగంలో వున్నాయి. మరో 40 వరకు క్వార్టర్లు ఖాళీగా ఉన్నాయి. ఏళ్ల తరబడి నిర్వహణ లేని కారణంగానే క్వార్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయని ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. క్వార్టర్ల ఆవరణలో పిచ్చిమొక్కల కారణంగా పాముల బెడద ఎక్కువగా ఉందని చెబుతున్నారు. రాత్రిపూట కుక్కల స్వైరవిహారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే పలు భవనాల్లో శ్లాబ్‌లు, సన్‌షేడ్ పెచ్చులు రాలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జంక్షన్‌ను ఆనుకుని ఈ క్వార్టర్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి క్వార్టర్లకు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

వైభవంగా పైడిమాంబ మహోత్సవం

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీలో శ్రీ పైడిమాంబ అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆది ఆంధ్ర సేవా సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి మూడు రోజులుగా నిర్వహిస్తున్న మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి ప్రధాన పండగ నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించినట్టు కమిటీ అధక్షుడు శివశంకర్ తెలిపారు. 16,17 తేదీల్లో అమ్మవారి చాటింపు, తొలేళ్ల అమ్మవారి దేవర ఉత్సవం నిర్వహించామన్నారు.



ప్రత్యేక అలంకరణలో పైడిమాంబ అమ్మవారు

దుర్గమ్మకు ఘనంగా పూజలు



ఆకట్టుకున్న పులి వేషధారులు



కాళీమాత వేషధారణలో కళాకారులు

సీతమ్మధార: దొండపర్తిలో మంగళవారం శ్రీ దుర్గమ్మ వారి జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పురవీధుల్లో అమ్మవారిని భక్తులు ఊరేగించారు. దారి పొడవునా అమ్మవారికి స్థానికులు పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవాల సందర్భంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. అమ్మవారి ఆలయం విద్యుద్దీప కాంతుల్లో ధగధగలాడింది. పులివేషాలు, కాళీమాత వేషాలు, డప్పులతో కళాకారులు అలరించారు. మహిళలు అమ్మవారికి పసుపు కుంకులు సమర్పించారు. యువతీ యువకులు నూతన వస్త్రాలు ధరించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు అల్లూరి సత్యనారాయణరెడ్డి, కారాల మహేష్, చిరంజీవి, పాలికల సింహాచలం, గురునాథరెడ్డి, టి.లలితాకుమార్, వెంకటేశ్వరరెడ్డి, ఈశ్వరరెడ్డి, కుమార్, సతీష్, ఆశిష్, అల్లూరి నాగేంద్రరెడ్డి, బొక్క సత్యనారాయణరెడ్డి, వెంకన్న, వంశీ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఏఎన్‌ఎంల ధర్నా

మహారాణిపేట: వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ఏఎన్‌ఎంలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలు నినాదాలు చేశారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న నాయకులతో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు చర్చలు జరిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, ఆందోళన విరమించాలని యూనియన్ నాయకులను డీఎంహెచ్‌వో కోరారు. అయినా ఏఎన్‌ఎంలు ఆందోళన కొనసాగించారు. బీసీజీ వ్యాక్సినేషన్‌ను రెండు రోజుల నుంచి తగ్గించాలని, యూనిఫారాల అలవెన్స్ ఇవ్వాలని, సెలవుల్లో కోత విధించరాదని, సచివాలయ ఏఎన్‌ఎంలపై పని ఒత్తిడి తగ్గించాలని, సెలవుల్లో కూడా విధులు నిర్వహించవలసి వస్తుందని నాయకురాలు మణి తెలిపారు. అధికారుల ఒత్తిడి అధికంగా ఉందంటూ ఆందోళన కొనసాగించారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్‌ఎంలు

కేజీహెచ్‌లో డెంగ్యూ కలకలం

యుద్ధప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టిన అధికారులు



సింటెక్స్ వాటర్ ట్యాంక్‌లో ఎప్పటి నుంచో ఉన్న నీటిని పరిశీలిస్తున్న మలేరియా అధికారి



నర్సింగ్ స్కూల్లో డెంగ్యూ నివారణకు మినీ ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది



నర్సింగ్ కళాశాల, స్కూల్ చుట్టూ యాంటీ లార్వా మందు పిచికారీ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

దాబాగార్డెన్స్: ఎంతో మందికి ఆరోగ్య సేవలందిస్తున్న కేజీహెచ్‌లో డెంగ్యూ కలకలం రేపుతోంది. అపరిశుభ్ర వాతావరణంతో కేజీహెచ్ కొట్టుమిట్టాడుతోంది. ముఖ్యంగా కేజీహెచ్‌కు అనుసంధానంగా ఉన్న నర్సింగ్ కళాశాల, నర్సింగ్ స్కూల్లో అపారిశుధ్యం తాండవిస్తోంది. డ్రైనేజీలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. డెంగ్యూ జ్వరంతో కేజీహెచ్‌లో చికిత్స పొందే ఎందరో రోగులకు వైద్య సేవలందిస్తున్న నర్సింగ్ విద్యార్థినికి డెంగ్యూ సోకింది. కింగ్ జార్జి ఆస్పత్రికి అనుసంధానంగా ఉన్న నర్సింగ్ స్కూల్ విద్యార్థినికి డెంగ్యూ సోకిన సమాచారం అందిన జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబశివరావు, జోన్-4 మలేరియా ఇన్‌స్పెక్టర్ రాంబాబు, సిబ్బంది, అప్రమత్తమయ్యారు. వ్యాధి మకరొకరికి సోకకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. అపరిశుభ్రంగా ఉన్న డ్రైనేజీలు, మూతలు లేని సింటెక్స్ మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయించారు. కేజీహెచ్‌లో యాంటీ లార్వా ఆపరేషన్, ఇండోర్ స్ప్రింగ్, మినీ ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టారు.

ఘనంగా శ్రీ మోదకొండమ్మ అమ్మవారి పండగ

అల్లిపురం : చలువతోటలో వెలసిన శ్రీ మోదకొండమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధి లో ఏర్పాటు చేసిన నారాయణసేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



వాసవీ క్లబ్ సేవలు ప్రశంసనీయం

పెదగంట్యాడ: సామాజిక సేవే ధ్యేయంగా వాసవీ క్లబ్‌లు పని చేస్తున్నాయని క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఆర్.రవిచంద్రన్ అన్నారు. విశాఖ జిల్లా పర్యటనలో భాగంగా పెదగంట్యాడ మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి పంచాయతన ఆలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి, అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా గాజువాక శ్రామికనగర్ ఎంపీపీ పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అలాగే పెదగంట్యాడ గ్రామం బోర్డుతో పాటు ఆలయంలో లాకర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్లబ్‌ల పనితీరు, సేవా కార్యక్రమాలను గురించి తెలుసుకునేందుకు పర్యటనలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అడ్డగళ్ల వేవే గుప్తా, కమలశ్రీ, సాయి నిర్మల, ఉమామహేశ్వరి, కట్టా సతీష్, కేసారపు నాగేశ్వరరావు, వాసవీ క్లబ్, వనిత క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రవిచంద్రన్ తదితరులు